క్లుప్తంగా

దుప్పట్లు పంపిణీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : శాంతిసేవా సొసైటీ 4వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో వివిధ కూడళ్లలో నిద్రిస్తున్న యాచకులకు గ్లోరీ సెక్యూరిటీ ఏజెన్సీ అధినేత అయ్యారి మునెయ్య దుప్పట్లను పంపిణీ చేశారు. శాంతిసేవా సొసైటీ వ్యవస్థాపకులు మండగలం ప్రసాద్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పేదలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శాంతిసేవా సొసైటీ సంఘం నాయకులు మోహన్, విజయ్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న దృశ్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవకులకు సివిల్ సర్వెంట్ హోదా ఇచ్చి ఎనిమిది గంటల పని కల్పించాలన్నారు. వీరికి అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా గ్రామీణ డాక్ యూనియన్ నాయకులు రఘురామిరెడ్డి, రఫీ, రాము, మహేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలను విస్మరిస్తున్న బీజేపీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను విస్మరిస్తోందని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ పై ఆర్టికల్ 370పై కోర్టు తీర్పు ముస్లిం మైనారిటీలను కలవరపాటుకు గురిచేస్తున్నాయన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ ఎన్నికల్లో ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటించడం దారుణం అన్నారు.

ఆర్టీసీ గ్యారేజి వద్ద నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎస్ శివారెడ్డి, రీజినల్ నాయకులు ఆర్.నారాయణ, రహమతుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ గ్యారేజీ వద్ద డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సిక్ లీవ్‌లకు జీతాలు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మెడికల్ రీఎంబర్స్‌మెంట్ కేసుల్లో ఉద్యోగులకు అవగాహన పెంచి వాటిని ప్రభుత్వ పరంగా, సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు లక్ష్మయ్య, పీఎం బాష, మల్లేష్, రవి, సుబ్బారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు వేతనాలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు, జిల్లాలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

17న అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 17వ తేదీ ఆదివారం 10 గంటలకు కడపలోని ఎన్‌జీవో భవన్‌లో డిపార్టుమెంట్ పరీక్షలపై అవగాహన సదస్సు ఉంటుందని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర, జిల్లా నాయకులు సివి ప్రసాద్, చెంగల్ రెడ్డి, ఆలీఖాన్, ఈశ్వరచంద్ర తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ పరీక్షలలో సులభంగా ఉత్తీర్ణత సాధించేందుకు ప్రశ్నావళిని నల్లబల్లపై బోధిస్తామని తెలిపారు. డిపార్ట్‌మెంట్ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కనీస వేతనం ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో పని చేస్తున్న వీఆర్వోల సమస్యలను ఈనెల 14న జరిగే క్యాబినెట్ సమావేశంలో పరిష్కరించాలని వీఆర్ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలకు కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని కోరారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష



సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని, పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసానిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్. బి. అంజాద్ బాషా అన్నారు. మంగళవారం స్థానిక ఉపముఖ్యమంత్రి నివాస క్యాంపు కార్యాలయంలో కడప నగరం నబీకోటకు చెందిన డి. శ్రీనివాసులుకు హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్ లో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స నిమిత్తం రూ. 10 లక్షల ఎల్ ఓ సి మంజూరు పత్రాన్ని అందజేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నారని.. అందులో వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం చేస్తున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ. 8 కోట్లకు పైగా సీఎం సహాయ నిధి కింద పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ ఇన్‌చార్జి వెల్లాల రామకృష్ణారెడ్డి, మధువర్ధన్ రెడ్డి, అబ్దుల్ సుబహాన్, బండి బాబు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించి సంస్థ ఆదాయానికి బాటలు వేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో వివిధ డిపోల నుంచి వచ్చిన డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలో ఇంధన పొదుపు చేయని డ్రైవర్లకు, బస్సులను డ్యామేజ్ చేసిన డ్రైవర్లకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ శిక్షణలో తెలియజేసిన అంశాలు, మెలకువలను ప్రతి డ్రైవరు అమలు చేయాలన్నారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సీజే రావులు డ్రైవర్లకు దిశా నిర్దేశం చేశారు. అలాగే డ్రైవర్లను ఫీల్డ్‌లోకి తీసుకెళ్లి ప్రమాద రహిత డ్రైవింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మిభాస్కర్, కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావుతోపాటు వివిధ డిపోలకు చెందిన 21 మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ నేత లోకేష్‌కు లేదని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ పాలనలో దోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడం తప్ప ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదన్నారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజాధనాన్ని నేరుగా ప్రజలకే చేరవేస్తున్నారని, ఇందులో దళారీ వ్యవస్థకు, లంచాలకు, అవినీతికి ఆస్కారం లేదన్నారు. ఏపీలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచిగా మారాయన్నారు. టీడీపీ మునిగిపోయే నావ అని, ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై ఎంత బురదజల్లినా ఉపయోగం లేదన్నారు.

ప్రారంభమైన అధ్యయనోత్సవాలు



ఆరాధన ఉత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తిరుమల–తిరుపతి దేవస్థానాల పరిధిలోని ఈ ఆలయంలో ధనుర్మాసం ప్రారంభ సూచికంగా ఈ అధ్యయనోత్సవాలను వారం రోజులపాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు పగలు పత్తు ఉత్సవం, ప్రత్యేక తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా తిరుమంగై ఆళ్వార్‌ను కొలువుదీర్చి విశేష అలంకారం చేసి మంగళ వాయిద్యాల మధ్య ఆలయ ప్రాకారం ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు కృష్ణ మోహన్, ఆలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల గ్రామోత్సవం

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె గ్రామంలో శివపార్వతుల గ్రామోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా గ్రామ సమీపంలోని శ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. నెల్లూరు వారి కోలాటం ఆకట్టుకుంది.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్ల సంఘాల ప్రతినిధులు

కడప కల్చరల్ : స్థానిక నాగరాజుపేట స్టార్ ఫంక్షన్ హాలులో సమైక్య క్రిస్మస్ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. కడప ఇండిపెండెంట్ పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అమలాపురానికి చెందిన బ్రదర్ నరేష్ హాజరై దైవ సందేశం అందించారు. అనంతరం అతిథులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టి ఉమ్మడిగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఆరు పాస్టర్ల సంఘాల అధ్యక్షులు ప్రసంగించారు. దైవ జనులంతా ఐకమత్యంగా విశ్వాసుల క్షేమం కోసం పాటుపడాలని కోరారు. పలువురు పేద పాస్టర్లకు గృహ వసతి కల్పించాలని, కడపలో క్రిస్టియన్ భవన్ ఏర్పాటు చేయాలని, పాస్టర్ల గౌరవ వేతనాన్ని రూ. 10 వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నగర ఇండిపెండెంట్ పాస్టర్ల సంఘం అధ్యక్షులు షద్రక్‌రాజు, పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, ఇవాంజలికల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రేమానందం, పలువురు పాస్టర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు

రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

వల్లూరు : మండలంలోని తోల్లగంగనపల్లె, తప్పెట్ల గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూ రక్ష మరియు భూ హక్కు పథకం కింద భూములకు సంబంధించిన రీ సర్వే జరుగుతోందని తహసీల్దార్ శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు వారి సమక్షంలో వారికి సంబంధించిన హద్దులను చూపించడం జరుగుతుందన్నారు. తోల్లగంగనపల్లె, తప్పెట్ల గ్రామాల పరిధిలో భూములు కలిగి భూ యాజమాన్య హక్కులు గల రైతులు సంబంధిత గ్రామ సచివాలయాలకు వచ్చి గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎండీ ద్వారక తిరుమలరావు తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ద పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావు ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ ద్వారక తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి మన సర్వీసును బాగా ఇవ్వడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన సూచించారు. పక్క రాష్ట్రాల కంటే మెరుగైన స్థితిలో ఏపీఎస్ ఆర్టీసీ ఉందని, ప్రభుత్వానికి ఆర్టీసీ ఉద్యోగులు ఎప్పుడూ రుణపడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సెక్రటేరియేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాకార్ల వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్ర, ఉపాధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలకు అడ్డుకట్ట వేయాలి



సమీక్షా సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : మాతృ మరణాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలోని ఛాంబర్‌లో దువ్వూరు, కామనూరు, కలసపాడు, వనిపెంట, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మాతృ మరణాలపై వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మాతృ మరణాల నివారణకు ప్రభుత్వం గట్టి చర్యలు చేపడుతోందని తెలిపారు. వైద్య సిబ్బంది మాతృ మరణాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, గైనకాలజిస్ట్ హెచ్‌ఓడీ డాక్టర్ లక్ష్మీ సుశీల, వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రాఘవేంద్రప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

కడప కార్పొరేషన్ : ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉన్నతాధికారులు 18 శాఖల ఉద్యోగుల పనితీరును పర్యవేక్షిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారన్నారు. కాగా ఒక్క ఎనర్జీ సెక్రటరీలను మాత్రం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సత్తార్, కుళ్లయప్ప, మల్లికార్జున, శ్రీనివాసులరెడ్డి, నాగేంద్ర, శివ, ఓంకార్, హాజీ బాషా పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలి



మెడికల్ అండ్ హెల్త్ ఆర్డీ డాక్టర్ రత్నకుమారికి వినతి పత్రం సమర్పిస్తున్న శ్రీనివాసులు తదితరులు

కడప రూరల్ : ఎల్‌హెచ్‌వీ ట్రైనింగ్ పూర్తి చేసిన ఏఎన్ఎంలకు సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 85 మంది ఏఎన్ఎంలు ఎల్‌హెచ్‌వీ ట్రైనింగ్‌ను పూర్తి చేశారన్నారు. వారికి సీనియారిటీ జాబితాలో చోటు కల్పించాలని తెలిపారు. అలాగే మహిళా సూపర్‌వైజర్స్‌కు పీహెచ్ఎన్‌గా పదోన్నతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో రవికుమార్, తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య, చిన్నయ్య, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న సునీల్‌రెడ్డి

కమలాపురం : ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే సేవా భావం కలిగి ఉండాలని ఎంఈఓ–2 సుభాషిణి తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీడీ కాలనీ ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ వల్లెల సునీల్‌రెడ్డి తన మిత్రుడు ఎన్ఆర్ఐ కోడూరు రాజేంద్రారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వితరణ చేసిన విద్యా సామగ్రిని ఎంఈఓ అందజేశారు. అలాగే విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే విద్యార్థులంతా పేద విద్యార్థులేనని వారికి ఇలా దాతలు సహకరించడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. అలాగే విద్యార్థులు కూడా దాతలను ఆదర్శంగా తీసుకుని మీరు ఉన్నత స్థానాల్లో స్థిర పడ్డాక ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

నరాల రామారెడ్డికి ఆటా ఆహ్వానం

ప్రొద్దుటూరు : అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఈనెల 17న నిర్వహించనున్న ఆటా అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాలని అవధాని డాక్టర్ నరాల రామారెడ్డికి ఆహ్వానం పంపారు. పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ప్రముఖ సాహితీ వేత్తలు వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు.

• ఆకట్టుకున్న అలంకారం



అర్ధనారీశ్వర అలంకారంలో శివుడు

కడప కల్చరల్ : కార్తీక మాసం ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయ ప్రాంగణంలో శివ పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని శివ మూర్తికి ఈ సందర్భంగా అర్ధనారీశ్వర అలంకారం చేశారు. అర్చకులు ప్రత్యేక శ్రద్ధతో శివ మూర్తిని ఓవైపు అమ్మవారిగా, మరోవైపు శివయ్యకు రూపుదిద్ది విశేష అలంకారం చేశారు. అంతకుముందు భక్తులందరూ స్వయంగా శివ మూర్తికి అభిషేకం చేసుకునే అవకాశాన్ని ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి కల్పించారు.

• దుర్గమ్మ సన్నిధిలో పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి



48 డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక 48వ డివిజన్‌లో బంగారు నాగయ్య ఆధ్వర్యంలో పరమేశ్వర స్కూల్ సమీపంలో నిర్వహించిన 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమంలో వారు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంకా అభివృద్ధి చెందాలన్నా, మన భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలన్నా మళ్లీ జగనన్నే సీఎం కావాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, ఆ పార్టీ నాయకులకే దోచిపెట్టిందన్నారు. జగనన్న ప్రభుత్వం లో సంక్షేమ పథకాల క్యాలండర్ ను రూపొందించి ప్రజల చెంతకు సంక్షేమ పథకాలను అందజేస్తుండడం గొప్ప విషయమన్నారు. అనంతరం 'ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి' అనే బుక్ లెట్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డా.ఓబుల్‌రెడ్డి, ఓబులేసు, శ్రీరాములు, మెప్మా సీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిబాబు

కడప అర్బన్ : ఎయిడ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రవిబాబు తెలియజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డీఏపీసీయూ వైఎస్ఆర్ కడప, జిల్లా జైళ్లశాఖ సంయుక్తంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని నెలవారీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడపలోని కేంద్రకారాగారంలో ఖైదీలందరికీ హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైళ్ల శాఖ సూపరింటెండెంట్ అధ్యక్షతన ఐఎస్‌హెచ్ ప్రకాష్ మాట్లాడారు. ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్. రవిబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు, హెచ్ఐవీ పరీక్షలు ఎక్కడ నిర్వహిస్తారు, హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులకు ఏఆర్‌టీ మందులు ఎక్కడ దొరుకుతాయి తదితర అంశాలపై వివరించారు. 1097 టోల్‌ఫ్రీకి కాల్ చేసి హెచ్ఐవీపై సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ వి. భాస్కర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పుష్పలత, పిజియోథెరపిస్ట్ మనోహర్, పిపిఎం కోఆర్డినేటర్ విజయచంద్ర, కడప కేంద్ర కారాగారం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోమవారం నాలుగు ట్రిప్పులు తిరగాలి



మార్నింగ్ విజిట్‌లో శానిటేషన్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో ప్రతి సోమవారం క్లాప్ వాహనాలు నాలుగు ట్రిప్పులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్. ప్రవీణ్ చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్ లో భాగంగా కాగితాలపెంట ప్రాంతంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించారు. కార్మికులు యూనిఫారం తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఇంటింటి చెత్త స్వీకరణ చేసే క్లాప్ వాహనాలు ఒక ట్రిప్పునకు 700 కిలోల పైగా చెత్తను స్వీకరించాలని, ప్రతిరోజూ మూడు ట్రిప్పులు తిరగాలన్నారు. సోమవారం నాలుగు ట్రిప్పులు తిప్పాలన్నారు. చెత్త స్వీకరించే కార్మికులు ప్రతి ఒక్కరూ గ్లౌవ్స్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పెన్నానదీ తీరంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తికి ప్రాకారోత్సవం చేశారు. సాయంత్రం అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా రూపొందించిన రథంపై ఆశీనులను చేసి అమ్మవారిశాల వద్దకు తీసుకువచ్చారు. అయ్యప్పస్వామి, శివపార్వతుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు నామా రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి వీపీ. పద్మనాభయ్య, కోశాధికారి టి.వినోద్‌కుమార్, పీఆర్‌ఓ ధారా సంతోష్, స్వామిఅయ్యప్ప సేవాసంఘం, శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్ష దారులు, భక్తులు పాల్గొన్నారు.